క్లుప్తంగా

వీరఘట్టంలో కుండపోత



వీరఘట్టంలో కురుస్తున్న వర్షం

వీరఘట్టం: మండల కేంద్రం వీరఘట్టంలో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుండి సుమారు గంట సేపు కుండపోతగా వర్షం కురిసింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. పగలంతా ఎండ తీవ్రతతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన జనాలు వర్షంతో ఉపశమనం పొందారు. ఈ వర్షం వరి పంటకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త రేషన్ కార్డుల అందజేత



అంపిలిలో అర్హులకు కొత్త రేషన్ కార్డులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్: మండలంలోని అంపిలి గ్రామంలో గురువారం కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇటీవల సురక్ష కార్యక్రమంలో గ్రామస్తులు అందించిన అర్జీలపై అధికారులు తక్షణ చర్యలు చేపట్టడంతో 14 మందికి నూతన కార్డులు మంజూరైనట్లు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు తెలిపారు. వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్‌తో కలసి లబ్ధిదారులకు నూతన బియ్యం కార్డులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు చింత సంగంనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వండువలో ఆధ్యాత్మిక శోభ



పూజలందుకున్న సాయిబాబా

వీరఘట్టం: మండలంలోని వండువ గ్రామంలో గురువారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలో వెలిసిన షిర్డీసాయి ధ్యాన మందిరంలో భక్తులు ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి నామస్మరణతో పూజలు చేశారు. ఉదయం కాగడ హారతితో పూజలు ప్రారంభమయ్యాయి. అనంతరం భక్తులు సాయినాధునికి పాలాభిషేకాలు చేశారు. ఆలయ ధర్మకర్త మజ్జి సింహాచలం ఆధ్వర్యంలో మహానారాయణ సేవ కార్యక్రమం చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వీరఘట్టం తెలగవీధిలో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్ శర్మయాజి ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేశారు.

భామినిలో ట్రైనీ ఐఏఎస్‌ల విడిది



ట్రైనీ ఐఏఎస్‌లకు వసతి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న పీఓ కల్పనాకుమారి

భామిని: పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన జీవన విధానంపై అధ్యయనం చేయడానికి రానున్న ట్రైనీ ఐఏఎస్‌ల బృందం భామినిలో విడిది చేయనుంది. ఈ నెల 27న రానున్న శిక్షణలోని14 మంది ట్రైనీ ఐఏఎస్‌లకు చేస్తున్న వసతి ఏర్పాట్లును సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కె.కల్పనాకుమారి గురువారం పరిశీలించారు. భామినిలో నిర్మాణం సాగుతున్న ఏకలవ్య మోడల్ స్కూల్ భవనాలు, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల భవనాలను పరిశీలించారు. టీడబ్ల్యూఆర్ స్కూల్ భవనాలను విడిదికి అనుకూలంగా గుర్తించారు. శిక్షణలోని 14 మంది ఐఏఎస్‌లు బృందంలో 9మంది పురుషులు, 5గురు మహిళలు ఉన్నారు. వీరు రెండు బృందాలుగా వారం రోజులు పాటు భామిని మండలం బొడ్డగూడ, సీతంపేట మండలం పూతికవలసలలో పర్యటించి గిరిజన జీవన విధానాలు గుర్తిస్తారని పీఓ కల్పనాకుమారి తెలిపారు. ఈ బృందాలకు లైజనింగ్ అధికారులుగా సీతంపేట ఏటీడబ్ల్యూఓ మంగవేణి, పీఏ మ్యార్సీ ఏఎంఓ కోటిబాబులు వ్యవహరించనున్నారు. వీరంతా గిరిజనుల ఆర్థిక సామాజిక స్థితిగతులు, సంస్కృతి సాంప్రదాయాలపై అధ్యయనం చేస్తారు. గిరిజన గ్రామాల్లో అమలు చేస్తున్న భూ సంస్కరణలు, పీసా చట్టం అమలు, వ్యవసాయ విధానాలు తెలుసుకుంటారు. గిరిజన కళలు, ఉపాధి కల్పన, విద్యా విధానాలు, ఆరోగ్య పరిస్థితులు అధ్యయనం చేస్తారు. ఐటీడీఏ పీఓ వెంట డీడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ సీలాపు అప్పారావు, ఏఎంఓ కోటిబాబు, ఏఈ శ్రీనివాసరావు, ఎంపీడీఓ చంద్రరావు ఉన్నారు.

బిషప్‌గా స్టీవెన్

సీతంపేట: లండా స్టీవెన్ పాస్టర్‌కు ఆంధ్రప్రదేశ్ ఫెలోషిప్ వారు బిషప్‌గా కొనసాగే అర్హతను ఇచ్చినట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛంద, దైవ కార్యక్రమాలు గుర్తించి ఫెలోషిప్ ప్రధానం చేశారన్నారు.

జయహో ఇస్రో

చంద్రయాన్ 3 విజయంతో భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన ఇస్రో శాస్త్రవేత్తలకు అన్ని వర్గాల నుంచి ప్రశంసలు అందుతున్నాయి. విద్యార్థి లోకం నుంచి మరింతగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. చంద్రయాన్ 3 విజయం భవిష్యత్‌లో భారత్‌ను శాస్త్ర సాంకేతిక రంగాల్లో మరింత రాణించేలా నమ్మకం కలిగించిందని అభినందిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కురుపాం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇస్రో ఆకారంలో ఏర్పాటై అభినందించిన విద్యార్థులు



జియ్యమ్మవలస : పెదమేరంగి కూడలి వద్ద చంద్రయాన్ - 3 అభినందన కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



కొమరాడ: కోటిపాం జెడ్పీ పాఠశాల ఆవరణలో రాకెట్ ఆకారంలో కూర్చొని శాస్త్రవేత్తలకు అభినందలు తెలియజేస్తున్న విద్యార్థులు



గుమ్మలక్ష్మీపురం: కేజీబీవీలో చంద్రయాన్ ప్రాజెక్ట్ 3 నమూనాతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మార్కెట్‌కు శ్రావణ శోభ

వీరఘట్టం: శ్రావణమాసంలో వచ్చే ముఖ్యమైన పండగ వరలక్ష్మీ వ్రతం. ఈ నెల 25న రెండవ శ్రావణ శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతం కావడంతో ఈ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో చేపట్టేందుకు మహిళలు సిద్ధమయ్యారు. పూజాకు కావాల్సిన పండ్లు, పూలు, కొబ్బరికాయలు, పత్రి తదితర సామగ్రిని కొనుగోలు చేసేందుకు మహిళలు రావడంతో వీరఘట్టం మార్కెట్ శ్రావణ శోభ సంతరించుకుంది. స్థానికంగా పండ్లు, పూలు సాగు లేకపోవడంతో డిమాండ్ బాగా పెరిగింది. కిలో చామంతి రూ.1000 లకు, కిలో గులాబీలు రూ.1200 వరకు అమ్ముడుపోయాయి. బంతిపూలు కిలో రూ.500లకు, కనకాంబరాలు కిలో రూ.2000 చొప్పున విక్రయించారు. పూజకు పూలు కావాల్సి ఉండడంతో వ్యాపారులు చెప్పిన ధరకు పూలు కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఆపిల్, ఆరెంజ్, ద్రాక్ష పండ్ల ధరలతో పాటు కొబ్బరికాయల ధరలు కూడా రెండింతలు పెరగడంతో ఈ ఏడాది పండ్లు, పూల వ్యాపారులకు శ్రావణమాసం బాగా కలిసి వచ్చిందని వ్యాపారులు అంటున్నారు. ఇటీవల వీరఘట్టంలో నూతనంగా నిర్మించిన శ్రీకోటదుర్గ తల్లి ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్ శర్మయాజీ ఆధ్వర్యంలో మహిళలచే సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలను చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా అన్ని దేవాలయాలు శ్రావణ శోభతో కలకల్లాడుతున్నాయి.



మార్కెట్‌లో అమ్ముతున్న పూలు



వీరఘట్టంలో అధిక ధర పలుకుతున్న పండ్లు

ప్రతి ఇంటా సంక్షేమం

- పారదర్శక పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం
- ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ ఇంటికి సంక్షేమ వసంతం వచ్చిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పారదర్శక పాలన సాధ్యమని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని టిటుకుపాయి పంచాయతీ పరిధిలో టిటుకుపాయిగూడ, కొత్తకోట, కుసుమూరు తదితర గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేతో పాటు అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి నాలుగేళ్లగా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు పథకాలు ఎలా అందుతున్నాయనేది అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, నిత్యం ప్రజలు సంతోషంగా ఉండే విధంగా అనేక పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మౌలిక వసతులైన రహదారులు, తాగునీరు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హాయంలో పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి గృహాలను నిర్మించారని, తర్వాత అధికారంలోకి వచ్చిన పాలకులు పేదలకు సెంటు స్థలాన్ని ఇవ్వలేకపోయారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేశారన్నారు. లబ్ధిదారులకు గృహాలను నిర్మించుకునేందుకు రూ.1.80 లక్షల నిధులు కూడా ఉచితంగా అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. ఎంపీపీ బి.ఆదినారాయణ, సర్పంచ్‌లు నిమ్మక అరుణ, బి.లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎస్.వెంకటేష్, కృష్ణ, చంద్రశేఖర్, కృష్ణ, సోమేశ్వరరావు, రామారావు, కుమారి, కె.కాంతారావు,తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి, సంక్షేమ కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కళావతి

రక్త పరీక్షలకు ఆధునిక యంత్రం

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో రక్త పరీక్షలకు ఆధునిక యంత్రాన్ని ప్రభుత్వం సమకూర్చింది. ఫుల్లీ ఆటో ఎనలైజర్ పేరుతో పిలవబడే ఈ రక్త పరీక్షల యంత్రం ద్వారా గంటలో 640 వివిధ రక్త పరీక్షలను చేయవచ్చని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. దీన్ని గురువారం ప్రారంభించామన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవల కోసమే దీన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు.



ఫుల్లి ఆటో ఎనలైజర్ మెషిన్ ప్రారంభిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

దివ్యాంగుల్లో ప్రతిభను గుర్తించాలి

వీరఘట్టం: దివ్యాంగుల్లో ఉన్న ప్రతిభను గుర్తించాలని పాలకొండ ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో దివ్యాంగులకు గురువారం నిర్వహించిన ఆటల పోటీలను ఆమె ప్రారంభించారు. రన్నింగ్, బేస్‌బాల్, షార్ట్ పుట్, స్లో వాక్, డిస్కస్ త్రో తదితర ఆటల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు డీవైఈఓ విజయకుమారి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఆర్.ఆనందరావు, ఐఈ ఆర్‌టీ ఆర్.రాంబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు శిర్లాపు ఉమామహేశ్వరరావు, సైల పద్మరాజు, ఐ.గంగాధర్ తదిరులు పాల్గొన్నారు.



గెలుపొందిన దివ్యాంగునికి బహుమతి ప్రధానం చేస్తున్న డీవైఈఓ విజయకుమారి

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన సెర్ప్ ఉద్యోగులు

జియ్యమ్మవలస: సెర్ప్ ఉద్యోగస్తులకు 23 శాతం జీతం పెంచడంతో వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగులు కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణికి తన నివాసంలో గురువారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు చేసిన మేలుకు జీవితాంతం రుణపడి ఉంటామని సెర్ప్ ఉద్యోగుల యూనియన్ లీడర్ ఈవీ కిశోర్, ఉద్యోగులు అన్నారు.



ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

పెంగవలో పశు వైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ జమ్ము పంచాయతీ పెంగవ గ్రామంలో గురువారం జట్టు - మాతోట జీవా ప్రాజెక్ట్ మరియు పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని అనారోగ్యం బారిన పడిన పశువులను గుర్తించి అవసరమైన వ్యాక్సిన్లను వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.లక్ష్మణరావు మాట్లాడుతూ ముఖ్యంగా ఈ సీజన్లో పశువులకు జబ్బవాపు, గొంతువాపు, ముద్ద చర్మ వ్యాధులు, గొర్రెలు, మేకలకు చిటుకు వ్యాధి, మూతిపుండ్లు, ముసరా వ్యాధులు, కోళ్లకు కొక్కెర వ్యాధి, మశూచి, క్షయ, బెరిబెరి, కండ్ల కలక వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. పశువులకు ఈ వ్యాధులు వచ్చినట్లు గుర్తించినట్లయితే తక్షణమే తమ సిబ్బందిని సంప్రదించి వైద్య సేవలు అందివ్వాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ జి.ప్రభోద్, జట్టు కో ఆర్డినేటర్ జి.మురళి, వెటర్నరీ అసిస్టెంట్లు ఎం.నవీన్, పి.నవీన్, టి.రామరావు తదితరులు పాల్గొన్నారు.



మేకకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

సక్రమంగా సరిహద్దు రాళ్ల ఏర్పాటు

- సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

పాలకొండ: గ్రామాల్లో సరిహద్దు రాళ్లు ఏర్పాటు సక్రమంగా చేపట్టాలని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదేశించారు. మండలంలోని సింగన్నవలస గ్రామంలో జరుగుతున్న సరిహద్దు రాళ్ల ఏర్పాటును ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు అందించారు. రైతుల సమక్షంలో రాళ్ల వేయాలని తెలిపారు. రాళ్ల పాతిపెట్టిన సమయంలో సర్వే గుర్తించిన ప్రాంతం పక్కాగా ఉండాలని తెలిపారు. ఎటువంటి సమస్యలు లేకుండా పనులు చేయాలని సూచించారు. ఎక్కడా వివాదాలకు తోవ లేకుండా పనులు చేయాలని తెలిపారు. ఆయనతో పాటు తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, సర్వే సిబ్బంది ఉన్నారు.



సరిహద్దు రాళ్లు ఏర్పాటుపై సూచనలిస్తున్న సబ్ కలెక్టర్

మున్సిపల్ కార్మికుల ఆందోళన



ర్యాలీ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పాలకొండ: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. పట్టణంలో మున్సిపల్ కార్మికులు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. పాలకొండ పట్టణం విస్తరించిన కారణంగా ఆ మేరకు కార్మికులను నియమించాలని కోరారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగం కల్పించాలని, కరోనా కాలంలో సేవలు అందించిన కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పడాల భాస్కరరావు, చింతల సురేష్, శ్రీదేవి, విమల, రఘు తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

గుమ్మలక్ష్మీపురం: ఖరీఫ్ సీజన్లో రైతులు సాగు చేస్తున్న వరి, పత్తి, రాగి తదితర పంటకు పంట కోత ప్రయోగాలు ఎలా నిర్వర్తించాలి అనే అంశాలపై గుమ్మలక్ష్మీపురం వీఏఓలు, వీహెచ్‌ఓలకు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్ఓ సతీష్ పంట కోత ప్రయోగాల నిర్వహణ ఎలా చేపట్టాలో శిక్షణ అందించారు. యూనిట్లను ఎలా ఎన్నుకోవాలి, ఏ మేరకు దిగుబడులను అంచనా వేయాలి అనే అంశాలను వివరించారు.



పంట కోత ప్రయోగాల నిర్వహణపై శిక్షణ ఇస్తున్న ఏఎస్ఓ సతీష్

డీలర్‌పై చర్యలకు డిమాండ్

జియ్యమ్మవలస: మండలంలోని గడసింగుపురం పంచాయతీలో ఇంతవరకు రేషన్ సరుకులు ఇవ్వలేదంటూ సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. గిరిజన సంఘం జిల్లా నాయకుడు సీతారాం మాట్లాడుతూ గడసింగుపురం పంచాయతీలోని ఏనుగుల గూడ గిరిజనులకు ఇంతవరకూ బియ్యం ఇవ్వకపోవడం వలన గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఏనుగుల గూడతో పాటు బూరిరామినాయుడువలస గ్రామానికి కూడా సరుకులు అందడం లేదన్నారు. సరుకులు సక్రమంగా ఇవ్వని డీలర్‌పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల కమిటీ సభ్యులు ఎ.రామారావు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజన సంఘ నాయకులు

పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ నియామకం

కొమరాడ: మండలంలోని గంగారేగువలస గ్రామ జంఝావతి కూడలి వద్ద ఉన్న ఎస్‌టీసీ చర్చ్ వద్ద గురువారం ఏపీ స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ అడిషనల్ సెక్రటరీ డా. పి.ప్రేమనందం ఆధ్వర్యంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ నియామకం జరిగిందని కొత్తగా ఎన్నికైన వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు బిషప్, ఎస్.తిమోతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పాస్టర్స్ అంతా ఐక్యత కలిగి ఉండి క్రీస్తు ప్రేమను సమాజానికి చాటి చెప్పాలన్నారు. క్రైస్తవ సమాజంలో ఉన్న సమస్యలపై దృష్టి పెట్టి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పాస్టర్ జాషువా, అభిషేక్, 55 మంది పాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులు

రోగులకు మెరుగైన వైద్య సేవలు

- డీసీహెచ్‌ఎస్ వాగ్దేవి

గుమ్మలక్ష్మీపురం: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ బి.వాగ్దేవి అన్నారు. మండల కేంద్రంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురు ఇన్‌పేషంట్లతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ల్యాబ్‌ను సందర్శించి చేపడుతున్న వ్యాధి నిర్ధారణ పరీక్షలను తనిఖీ చేశారు. మందుల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రస్తుతం వైరల్ ఫీవర్స్ ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. దోమల నివారణ కోసం ప్రస్తుతం కొనసాగుతున్న రెండో విడత ఏసీఎం 5 శాతం మందు పిచికారీ కార్యక్రమం ఈ నెలాఖరుకు పూర్తవుతుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 17 డెంగీ కేసులు నమోదయ్యాయన్నారు. డెంగీ వ్యాధి సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఆస్పత్రుల్లో వైద్యులు, స్పెషలిస్ట్ వైద్యుల కొరతతో పాటు, మందుల కొరత కూడా లేదన్నారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో ప్రసవాలు జరుగుతున్నాయని, దాదాపు 80 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరుగుతుండటం వల్ల ప్రసవాల జాబితాలో రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ వైద్యసేవలు పొందడంలో కూడా జిల్లా ముందంజలో ఉందన్నారు. అనంతరం ఆమె ఆస్పత్రి ఆవరణలో ఏపీఎం ఐడీసీ నిధులు రూ.8.9కోట్లతో నిర్మిస్తున్న భవనాల సముదాయాల్ని పరిశీలించారు. ఆమె వెంట స్థానిక వైద్యులు ఉన్నారు.



భద్రగిరి సీహెచ్‌సీలో ఇన్‌పేషంట్ల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న డీసీహెచ్‌ఎస్ వాగ్దేవి